క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నకరికల్లు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆ శాఖ ఏఈ షేక్.గౌస్ వినియోగదారులను శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని తెలిపారు. వ్యవసాయ, గృహ వినియోగద విద్యుత్ పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లిస్తే అపరాధ రుసుం తగ్గించుకోవచ్చన్నారు.

సంక్రాంతికి కోడి పందేలు నిషేధం

అమరావతి: అమరావతి సర్కిల్ పరిధిలో కోడి పందేలు నిర్వహించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ అమీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ముందు జాగ్రత్తగా 15 మంది పందెపు కోళ్లను పెంచె వారిని తహసీల్దార్ వద్ద రూ.2 లక్షలకు బైండోవర్ కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులకు సహకరించి కోళ్ల పందేల సమాచారం 94407 96217, 94407 96266 నంబర్లకు అందించాలన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నకరికల్లు: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చల్లా సురేష్ శనివారం హెచ్చరించారు. నిర్మానుష్య ప్రాంతాలు, గ్రామ శివార్లు, కొండ ప్రాంతాల వద్ద గట్టి నిఘా పెట్టామన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా పండగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

రక్తదానం

పీసపాడు(క్రోసూరు): పీసపాడు గ్రామంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిలోయాన్ వర్షిత్ ప్రార్థన మందిర తరుపున శనివారం రక్తదానం చేశారు. మందిర పాస్టరమ్మ విప్పల వేదవతి పుట్టిన రోజు సందర్భంగా ఆమె భర్త ప్వాస్టర్ విప్పల సత్యనారాయణరెడ్డి, కుమార్తె విప్పల మెర్సీ, బంధువు మున్నం ప్రశాంతరెడ్డి ముగ్గురు సత్తెనపల్లిలోని సత్యబ్లడ్ బ్యాంక్ నందు రక్తదానం చేసినట్లు తెలిపారు.

18న గంగాదేవీ తిరునాళ్లకు వేలం పాట

క్రోసూరు: ఓర్వకల్లు గ్రామంలోని ఫిబ్రవరి 12న జరిగే గంగాదేవీ పేరాంటళమ్మ తిరునాళ్లలో దుకాణాల హక్కులు పొందేందుకు వేలం పాట ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీర భద్రమల్లికార్జునస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 11గంటలకు పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు, నెల పొంగళ్లు మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు లైసెన్సు హక్కులు పొందుతారని తెలిపారు. పాటలో పాల్గొనే వారు హిందువై ఉండాలన్నారు. రూ.10 వేలు డిపాజిట్ చేయాలని, చెప్పుల భద్రపరుచుకునే హక్కుకు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు. పాడుకున్న వారు వెంటనే నగదు చెల్లించాలని చెప్పారు.

విజేతలకు బహుమతులు

అచ్చంపేట: ముక్కోటి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల విజేతలకు నిర్వహకులు శుక్రవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గుండా రమేష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఏపీ ఫైబర్ నెట్

- మూలన పడిన ఏపీ ఫైబర్ నెట్ యూనిట్ బాక్స్‌లు
- హైస్పీడ్ నెట్, తక్కువ రేటుకే కేబుల్ కనెక్షన్ల సౌకర్యం
- యూనిట్ రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు
- గత ప్రభుత్వంలో ప్రతి సచివాలయంలో ఏర్పాటు
- కూటమి ప్రభుత్వంలో నిర్వహణ గాలికి
- ఇంటర్‌నెట్ సౌకర్యం లేక సిబ్బంది అవస్థలు
- మొబైల్ ఫోన్ డేటాతో లాగిస్తున్న వైనం
- ధృవ పత్రాలు మంజూరుకు తప్పని జాప్యం



ముప్పాళ్ళ గ్రామసచివాలయంలో నిరుపయోగంగా ఏపీ ఫైబర్‌నెట్ బాక్స్

ముప్పాళ్ళ: గ్రామాల్లో ఏపీ ఫైబర్ నెట్ సేవలు అటకెక్కాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోని ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్ యూనిట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. సచివాలయాలకు హైస్పీడ్ ఇంటర్ నెట్, తద్వారా గ్రామంలో ఇంటింటికీ తక్కువ రేటుకే కేబుల్ కనెక్షన్‌లో భాగంగా ఈ యూనిట్లు ఏర్పాటు చేశారు. మండలంలోని 14 గ్రామ సచివాలయ భవనాల్లో ఈ బాక్స్‌లు అమర్చారు. ఒక యూనిట్ ఏర్పాటు కోసం సుమారు రూ.50 వేల నుంచి లక్ష రూపాలయల వరకు వెచ్చించారు. ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన ఈ ఫైబర్ నెట్ సర్వీసు పనిచేయక పోయినా అధికారులు ఏమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

వేధిస్తున్న సిగ్నల్ సమస్య...

మండలంలో అన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్య వేధిస్తోంది. ప్రభుత్వ పనుల పూర్తి కావడం కోసం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తమ మొబైల్ డేటాతో పనులు కానిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఇంటర్‌నెట్ పనిచేయడం లేదని సాకులు చెప్పి, పనులు వాయిదా వేస్తున్న సందర్భాలూ ఉన్నాయి. మరి కొన్ని గ్రామ సచివాలయాల్లో పంచాయతీల నెలవారీ బిల్లులు చెల్లించి ప్రయివేట్ ఇంటర్‌నెట్ సదుపాయం పొందుతున్నారు. ఇంటర్‌నెట్ సదుపాయం సరిగ్గా లేకపోవడంతో అర్జీదారులు సమయానికి ధృవీకరణ పత్రాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షల రూపాయలు చెల్లించి ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యూనిట్ బాక్స్‌లు ద్వారా ఇంటర్ నెట్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు.

ఫైబర్ నెట్ సేవలు పునరుద్ధరించాలి



పంచాయతీల్లో హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయం అవసరం. ఆధార్, ఇతర సేవల కోసం ప్రజలు సచివాలయం, ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. సచివాలయాల్లో తరచూ ఆన్‌లైన్ సేవలు మొరాయిస్తున్నాయి. మూలన పెట్టిన ఏపీ ఫైబర్‌నెట్‌ను వినియోగంలోకి తేవాలి.

–మధిర రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, చాగంటివారిపాలెం

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు



గ్రామ సచివాలయాల్లో ఏపీ ఫైబర్ నెట్ సర్వీసులు సరిగ్గా పనిచేయటం లేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

–పీజే విలియమ్స్, ఎంపీడీవో, ముప్పాళ్ల

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

సత్తెనపల్లి: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి అన్నారు. పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో శనివారం ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ప్రతి క్రీడా కారుడు తమలోని క్రీడా ప్రతిభను ప్రదర్శించి గెలుపొందాలన్నారు. డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిని అభినందించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

క్రోసూరు: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగ సరదాగా, సంతోషంగా నిర్వహించుకోవాలని క్రోసూరు సీఐ పి.సురేష్, ఎస్ఐ నాగేంద్రరావు కోరారు. క్రోసూరు పోలీసు స్టేషన్‌లో శనివారం మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులతో సంక్రాంతి పండగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమారాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. కోడి పందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలి


హిందూ శ్మాశాన వాటిక వద్ద మాట్లాడుతున్న వడ్డవల్లి వాసులు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి హిందూ స్మశాన వాటికలో నెలకున్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వడ్డవల్లి వాసులు డిమాండ్ చేశారు. స్మశాన వాటికను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ సరైన వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. స్మశాన వాటికి మొత్తం పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, దహనానికి, ఖననానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షం కురిస్తే శవ దహనం కూడా చేయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కనీసం స్నానాలకు, పిండ ప్రధాన పూజలకు, అస్తికలు పెట్టుకోవడానికి నేల మీద గచ్చు లేక బురదమయంగా ఉందన్నారు. కనీసం చేతిపంపు కూడా సక్రమంగా పనిచేయడం లేదన్నారు. దీనిపై స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వడ్డవల్లి దాసరి రాజశేఖర్, ఎం.వి.రాఘవేంద్రరావు, దాసరి తిరుపతిరావు, తోట సదా, గండేపల్లి వెంకట్రావు, తోట పోతురాజు, అంజి, అంకమ్మరావు, పోకల శంకర్ ఉన్నారు.

ఓబన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం


వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..


మున్సిపల్ కార్యాలయంలో నివాళి..

సత్తెనపల్లి: స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని వడ్డెర సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరవీరుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వేముల వరప్రసాదరావు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు చెంబేటి శివరామకృష్ణ, మల్లెల పాపారావు, చల్లా ఆంజనేయులు, దేవళ్ళ నాగయ్య, ఒంటిపులి వెంకటేశ్వర్లు, ఒంటిపులి కోటేశ్వరరావు, పల్లపు వెంకటస్వామి, 24వ వార్డు కౌన్సిలర్ అచ్చుత శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు వల్లెం నరసింహారావు, వాకుమళ్ల చెంచిరెడ్డి, మందడపు శివసాయి ఉన్నారు.

– రేనాటి వీరుడు, తొలినాటి స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బత్తుల వెంకటస్వామి, జిల్లా వడ్డెర వెల్ఫేర్ బోర్డు మాజీ డైరెక్టర్ కొమెర వీరాంజనేయులు, వడ్డెర సంఘ నాయకులు గుంజి విజయకుమార్, ఒంటిపులి నాగేశ్వరరావు, పల్లపు ధర్మారావు, చల్లా శ్రీనివాసరావు, వేముల కొండయ్య, బుర్సు శ్రీనివాసరావు, వేముల వరప్రసాదరావు, పాపారావు, చల్లా అంజి, ప్రసాద్ పాల్గొన్నారు.


ఓబన్న ఆదర్శప్రాయుడు

అచ్చంపేట: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఓబన్న చిత్రపటానికి పలువురు వడ్డెర సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ నాయకులు శివరాత్రి శ్రీనివాసరావు, సాతర్ల శ్రీనివాసరావు, చల్లా అనుపకళ, బత్తుల సాంబశివరావు, నల్లమేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

క్రోసూరు: పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యాంసస్ ఆధ్వర్యంలో గత మంగళవారం పీహెచ్‌సీలో మహిళా సిబ్బందికి నిర్వహించిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ధనుష్, డాక్టర్ షేక్ మహ్మద్‌సాద్, డాక్టర్ సిరిచందన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్గ నిర్దేశకుడు స్వామి వివేకానంద



సత్తెనపల్లి: నిస్తేజమైపోతున్న నాటి భారతీయులను ప్రేరేపించేందుకు స్వామి వివేకానంద శంఖం పూరించారు. ఆ శంఖారావం అత్యంత శక్తివంతంగా జాతిని, ప్రత్యేకించి యువతను ఉత్తేజ పరిచింది. మన ఉప నిషత్తులు, భగవద్గీత, పురాణ సారాలను తనదైన శైలిలో స్వామి వివేకానందుడు ప్రచారం చేశారు. యువతను లక్ష్య సాధన దిశగా కార్యోన్ముఖులను చేశారు. మన సంస్కృతి విలువలను చాటి చెప్పి తద్వారా స్వాతంత్రోద్యమ దీప్తిని వెలిగించారు. నేటికీ, ఏనాటికి తరగని స్ఫూర్తిని నింపారు. సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎనలేని సేవ చేసిన వివేకానందుడు నేటి యువతకు ఆదర్శమూర్తి. ఆయన బాటలో యువత పయనించి, ప్రగతి సాధించాలని పలువురు సూచిస్తున్నారు.

వివేకానంద బాటలో పయనించాలి



యువత స్వామి వివేకానంద చూపిన బాటలో పయనిస్తూ తమలో నిద్రాణమై ఉన్న అనంతశక్తిని గుర్తించాలి. అమృత తుల్యులమనే ఎరుకతో ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగి దృఢ దీక్షతో ముందుకు సాగాలి. నైతిక విలువలను ఊపిరిగా చేసుకోవాలి. ఈ భరతావనిలో పుట్టినందుకు ఆనందిస్తూ జన్మ చరితార్థం చేసుకోవాలి.

–మాడా మల్లికార్జునరావు, అధ్యక్షుడు, అభ్యుదయ విజ్ఞాన సేవా సమితి, సత్తెనపల్లి

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కళాశాలలో విద్యను అభ్యసించే సమయంలోనే విలువలు పెంచుకునేందుకు తగు శిక్షణ, కంప్యూటర్, భావ వ్యక్తీకరణ, రీజనింగ్, అర్థమెటిక్ తదితర అంశాల్లో శిక్షణ పొందడం అవసరం. యువత ఆదర్శనీయులు, మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి వారిని స్ఫూర్తిగా తీసుకుంటే ఉన్నతి సాధించే అవకాశం ఉంటుంది.

–జక్కుల లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

యువత భవిష్యత్తుకు వారధులు



భవిష్యత్తు, వర్తమానాలకు యువత వారధి లాంటివారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు తెలుసుకోవాల్సిన బాధ్యత వీరిది. దేశ భవిష్యత్తును నిర్దేశించేది నేటి యువతే. యువజనోత్సవాల పేరిట స్వామి వివేకానంద జయంతి నిర్వహిస్తున్నారు. విద్యాలయాల్లో మాత్రమే అమలు చేస్తున్నారు. గ్రామాల్లోనూ యువజనోత్సవాలు జరిపి యువతకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.

–బంకా వాసుబాబు, ఉపాధ్యాయుడు, సత్తెనపల్లి

ముందస్తు సంక్రాంతి సంబరాలు


సత్తెనపల్లి: హోలీ ఫ్యామిలీ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


సత్తెనపల్లి: విద్యార్థినులు, ఉపాధ్యాయుల కోలాటం


ముప్పాళ్ల: పీహెచ్‌సీలో పాల్గొన్న భోగి మంట వద్ద ఉద్యోగుల నృత్యం


ముప్పాళ్ళ: సంక్రాంతి ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. పొంగళ్లు.. కోలాటాలు.. గొబ్బెమ్మలు.. రంగ వల్లులతో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో సంబరాలు అంబరాన్నంటాయి. గాలిపటాలు ఎగరేస్తూ సాంప్రదాయాలను పాటించి, సంతోషంగా గడిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


వడ్డవల్లి నుంచి శ్రీవారి గ్రామోత్సవంలో మహిళలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీవారి దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రోహిణి నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారిని విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వడ్డవల్లి దేవాలయం నుంచి శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా మహిళలు, చిన్నారులు కోలాట దర్శన వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టణంలో పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. రైల్వేస్టేషన్‌రోడ్ లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుగంధ పరిమళ చందన అలంకరణతో శ్రీవారిని అలంకరించి పూజలు నిర్వహించారు.


రైల్వేస్టేషన్ రోడ్డులో చందన అలంకారంలో..



పల్నాడు జిల్లా ముఖద్వారం సత్తెనపల్లి

- విద్యా, వైద్య, వ్యాపార రంగాల్లో రాణింపు
- నాటి సత్యన్న పేరే.. నేటి సత్తెనపల్లి


సత్తెనపల్లికి చిహ్నంగా నిలిచే గడియార స్తంభం


సర్వాంగా సుందరంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాల భవనం

సత్తెనపల్లి: పల్లవులు, విష్ణుకుండిలు, కాకతీయులు పరిపాలించిన రాజ్యంలో కొంత భాగమే సత్తెనపల్లి ప్రాంతమని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. 1707–1712 సంవత్సరాల మధ్య కాలంలో మానూరు, వాసి రెడ్డి సంస్థానల కింద పరిపాలన సాగేది. 1777లో వీరి మధ్య జరిగిన ప్రాంతాల విభజనతో సత్తెనపల్లి ప్రాంతం మానూరి వారి జమానా కిందకు వచ్చింది. నాడు సత్యన్న అనే వడ్డెర నాయకుడి పేరు మీద కొన్ని గృహాలు ఇక్కడ నిర్మించారు. అతని పేరు కాస్తా రానురాను సత్తెనపల్లిగా మారింది. కాలక్రమేణ సత్తెనపల్లిగా స్థిరపడిపోయింది. 1713 కాలంలో నాటి మహమ్మదీయ ప్రభువు సత్తెనపల్లి ప్రాంతాన్ని రాజా మానూరి వెంకట్రావుకు ఇనాంగా ఇచ్చారు. 1779కి పూర్వం ప్రస్తుతం గాంధీ చౌక్ సమీపంలోని పాత సూర్య థియేటర్ ప్రదేశములో కోట నిర్మించి సత్తెనపల్లి ప్రాంతాన్ని వారు పరిపాలించారు. పట్టణంలోని ప్రధాన రహదారి అచ్చంపేట వెళ్లే మలుపునకు ఎదురుగా వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. దానికి ఎదురుగా 12 అడుగుల ఎత్తుగల ఉక్కు స్తంభాన్ని ఏర్పాటు చేసి, దానికి ఐదు లాంతర్లు అమర్చారు. ఆ లాంతర్ల ఆధారంగానే గుంటూరు వైపు, మాచర్ల వైపు, మాదిపాడు వైపు, నరసరావుపేట వైపు వెళ్లే బాటసారులకు వెలుగునిచ్చేది. మరికొంత ముందుకు వస్తే గడియార స్తంభం ప్రధాన రహదారి మధ్య కనిపించేది. అప్పట్లో పెద్దగా కాలం తెలుసుకునే వాచీలు లేకపోవడంతో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ఈ గడియార స్తంభాన్ని చూసుకుని బాటసారులు తమ తమ ప్రాంతాలకు వెళ్లేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం సత్తెనపల్లి గ్రామ పంచాయతీగా సుమారు నాలుగు దశాబ్దాలపాటు సేవలు అందించింది. రానురాను జనాభివృద్ధితో 1984 మార్చి 2న సత్తెనపల్లిని పురపాలకంగా మార్చారు. అప్పట్లో నన్నపనేని రాజకుమారి శాసన సభ్యురాలుగా పని చేస్తున్నారు. 1987 మార్చి 30వ తేదీ నుంచి పురపాలన అమలులోకి వచ్చింది.

నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఇక్కడి నుంచే ఉద్యమం

సత్తెనపల్లి ఆరంభం నుంచి ప్రజా ఉద్యమాలకు నిలయంగా నిలిచింది. 1952–53లో నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి రైతు ఉద్యమం ఇక్కడి నుంచే మొదలైంది. పట్టణంలోని పాత బస్టాండ్‌లో అప్పట్లో బహిరంగ సభ నిర్వహించి, గ్రామాల్లో చైతన్యం కల్పించారు. అప్పట్లో ఆల్ ఇండియా నాయకత్వం సత్తెనపల్లి వచ్చింది.

రెండవ సారి అవకాశం లేని పాలకులు

సత్తెనపల్లి మున్సిపాలిటీగా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయింది. తొలుత 17 వార్డులు, 30 వేల జనాభాతో మూడవ గ్రేడ్ మున్సిపాలిటీగా ప్రస్థానం మొదలైంది. ప్రస్తుతం 31 వార్డులతో 56,663 మంది జనాభాతో రెండవ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయ్యింది. ఈ మున్సిపాలిటీని ఇప్పటి వరకు నలుగురు చైర్మన్లు పాలించారు. వీరిలో వెలుగూరి విజయవెంకటలక్ష్మీనారాయణ, కొడాలి ఉమాదేవి, కొల్లిపర కాశీవిశ్వనాథం, గంటా సరస్వతి, యెల్లినేడి రామస్వామిలు పాలించారు. ముగ్గురు ఆర్యవైశ్యులు కాగా, ఒకరు బీసీ, ఒక్కరు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. రెండవ సారి పాలించే అవకాశం ఇప్పటి వరకు ఎవరికి రాలేదు. ప్రస్తుతం చల్లంచర్ల లక్ష్మీతులసీ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆమె ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు.

పట్టణంలో రూ.367.96 కోట్లతో సంక్షేమాభివృద్ధి

పట్టణంలో మునుపెన్నాడూ లేని విధంగా గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు చొరవతో రూ.367,96,82,268లతో సంక్షేమాభివృద్ధి చేపట్టారు. 29 సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ కింద 67,876 మందికి రూ.216,77,69, 454 లబ్ధి చేకూరగా.. నాన్ డీబీటీ కింద 14,495 మందికి రూ.124,98,55,656ల లబ్ధి చేకూరింది. డీబీటీ, నాన్‌డీబీటీ కింద 82,371 మందికి రూ.341,76,25,110 లబ్ధి చేకూరింది. ఇక అభివృద్ధి విషయానికి వస్తే రూ.262,05,7,158తో ఖర్చు చేశారు. వీటిల్లో ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో గత 30 ఏళ్లుగా పేరుకు పోయిన డంపింగ్ యార్డ్‌ల్లోని చెత్తా చెదారాన్ని శాస్త్రీయ పద్ధతిలో తొలగించారు. ఏరియా వైద్యశాల అభివృద్ధితో పాటు రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. నాడు–నేడు క్రింద పాఠశాలల రూపురేఖలు మార్చారు. మూడు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలను నిర్మించారు. మార్కెట్ యార్డ్ వద్ద అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను నిర్మించారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా 14వ వార్డులో రెండు మున్సి పల్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ముస్లింలకు మసీదు స్థలానికి ప్రత్యేకంగా హక్కులు కల్పించారు. చెక్‌పోస్ట్ వద్ద ముస్లిం సోదరులకు గదుల నిర్మాణం చేపట్టారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు.